# పరిమళ కలలది యే పరిమళం!?!

కుప్పిలి పద్మ

కోవెల వీధి పొడుగుతా యెర్రని గులాబీ పువ్వులు… పసుపచ్చని చామంతులు.. తులసిమాలలూ.. నున్నని టెంకాయలు… అరటిపళ్ళు… అగరొత్తులు..
కర్పూరం.. పూజసామానుతో అంగళ్ళన్నీ రంగురంగులమిలమిలలు.. పరిమళపు ఘుమఘుమల వీధిలో వో అంగడిలో స్థిరపడిపోయిన చేదు మనసుతో సుహాసినీని నిద్రపుచ్చుతూ కూర్చుని చుట్టూ చూస్తోంది పరిమళ.

వొకప్పుడు యీ వీధివీధంతా కిక్కిరిసిన కోలాహలంతో నిత్యతిరనాళ్ళ వుండేది. సగం అంగళ్ళు తీసి లేవు. కోవెలకి యెప్పుడొచ్చిన పూజసామాగ్రిని చిన్ని గుడ్డ సంచిలో పెట్టి నోరారా నవ్వుతూ తమకి యిచ్చే వేలూ కనిపించలేదు. కొట్టూ మూసేసి వుండేది. చెప్పులని అక్కడే విప్పి వెళ్ళమనే వాడు. భద్రంగా చూసుకుంటాను అనేవాడు.

"నేనిచ్చే సాంబ్రాణి సువాసన యెక్కడా దొరకాదు.. ఆ ధూపానికి కోరిన కోరికలు తీర్చేకుండా తప్పుకోలేడు ఆ పరమాత్ముడు కూడా" అనే వేలూ వాసననని రద్దు చేసి కోవిడ్ అతన్ని పట్టుకుపోయింది. యెంత దుర్మార్గపు కాలం.. యెవరున్నారో యెవరు పోయారో కూడా తెలియని కాలం. యెంత మందిని ఆహ్లాదకరమైన సువాసనలని నింపుకోనివ్వకుండా పట్టుకుపోయిందో.. వాసన కోల్పోయిన సమయాల నుంచి బయట పడిన యెందరిలోనో తిరిగి ఆ యింద్రియ జ్ఞానం తిరిగొచ్చిందో లేదో… యేది యేమైనా వొకప్పటి రద్దీ లేని కోవెల వీధి. మాస్క్ ల వెనుక అణిగిపోయిన చిరునవ్వుల హోరు.

"మూడో వేవ్ వస్తుందా?! మళ్ళీ లాక్ డౌన్ వస్తుందా?!" అనేక మందిలో తిరుగుతున్నట్టే పరిమళ గుండెల్లో కూడా పసిరిక పాముల్లా తిరుగుతోన్న సందేహాలు. అనుమానాలు.
"ప్చ్.. అలా జరగకుండా వుండాల్సింది.. అసలు అలా జీవితాలు యెందుకు యేకాకి అదృశ్యాలయ్యాయి" ?!!
హృదయ స్మృతులలో కోల్పోయిన జీవన సుగంధపు జ్ఞాపకాలు చిత్తడి చిత్తడిగా పరిమళ మనసులో…

*

- యిల్లంతా శూన్యంగా వుంది. యే చప్పుడూ లేదు.

బయట వీధిలో కూడా నిశ్శబ్దం. యింట్లో యే అలికిడీ లేకపోయినా యేదో సువాసన సుడులు తిరుగుతుంది.
అది తనకు యీ ప్రపంచంలోకి రాగానే పరిచితమైన తొట్టతొలి సువాసన. మంత్రసాని చేతులో అమ్మ పొత్తిళ్ళ, నాన్న అరచేతుల పరిమళమో కాదది.
అగరొత్తుల పరిమళం!
యెప్పటిలా వొత్తుగా కాకపోయినా యింట్లో బట్టలకీ, గోడలకీ, పై కప్పుకీ, గిన్నెలకు, సమస్తంలోకి యింకిపోయిన అగరొత్తుల పరిమళం –
పరిమళ తన అర చేతుల వైపు చూసుకుంది. నల్లబారిపోయిన అరచేతుల్లోని రేఖలు మరింత నల్లగా, దట్టంగా కనిపిస్తున్నాయి. అరచేతుల్తో మొఖాన్ని రుద్దుకొంది. యే స్పర్శా తెలియలేదు. మొఖం మొద్దు బారిపోయినట్టుంది. ఆకలికో, అగరొత్తుల పరిమళానికో తెలియదు. పక్కలో చిన్నారి సుహాసిని వులిక్కిపడి కెవ్వున యేడవటం మొదలుపెట్టింది. పటిక బెల్లం నీళ్ళు పోసిన పాలసీసాని పాపాయి నోటికందించింది. సుహాసిని వొక్క క్షణం చప్పరించి ఆ రుచి నోటికి తెలియగానే పీకని బయటకు తోసేసి తిరిగి గుక్కపట్టింది. బాత్రూం తలుపు తోసుకొని హడావుడిగా బయటకొచ్చిన పరిమళ చిన్నక్క కృష్ణవేణి సుహాసినిని యెత్తుకొని 'వో ళ్ళు ళ్ళు' అని వోదార్చడం మొదలు పెట్టింది. అలాగే తలుపు దగ్గరకు వెళ్ళి వొక రెక్కతీసి వీధిలోకి చూసింది.
"కర్ఫ్యూ మొదలైనట్టుంది, అమ్మింకా రాలేదు" అంది.
చాప మీద పడుకున్న పరిమళ నీరసంగా పక్కకు పొర్లింది. పాపయి యేడుస్తూనే వుంది.
తలుపు దగ్గరే గోడకు ఆనుకొని చేరబడి కూర్చొని నీళ్ళసీసా తీసుకొని పాపయి నోటికందించింది కృష్ణవేణి. యేడుస్తోన్న పాపాయి యిక తప్పదనుకుందేమో ఆ నీళ్ళనే బలవంతంగా గుటకెయ్యడం మొదలుపెట్టింది. వొళ్ళోని పాపాయిని నీరసంగా లాలిస్తూ "పక్కింట్లో కూడా యే చప్పుడూ లేదు. పాపత్తమ్మవాళ్ళు యింట్లో లేరా?!"
పరిమళ తలెత్తి చూసింది కానీ యేమీ మాట్లాడలేదు.
"అమ్మింకా రాలేదు. యెక్కడ వుందో.." అంది కృష్ణవేణి.
వరుసగా యిది మూడో రోజు.. కర్ఫ్యూ సడలించగానే తులశమ్మ బయటకెళ్ళి.. కర్ఫ్యూ పెట్టడానికి ముందే వో పాల ప్యాకెట్టు, అమ్మా క్యాంటీన్ నుంచి తినడానికి పట్టుకొని వస్తుంది. యీ రోజు ఆలస్యమైంది.. యెక్కడెక్కడ తిరుగుతుందో.. యీ రోజు అమ్మా క్యాంటీన్ వరకూ వెళ్ళే సమయం లేదు. డబ్బులూ లేవు. ఉమర్ ని కలవాలని వెళ్ళింది.
"ఉమర్ భయ్యా దొరికుంటాడా.. ? తనలో తాను ఆలోచించుకుంటున్నట్టు కృష్ణవేణి అడిగింది.
చిన్నగా తన పెదాల్ని సాగదీసింది పరిమళ. మొద్దుబారిపోయి పెచ్చుకట్టేసిన పెదాలు పూర్తిగా విచ్చుకోలేదు.

కృష్ణవేణి తల తిప్పి వీధిలోకి చూస్తుంది. ఆమె వాలిపోతోన్న రెప్పల్లో యేదో ఆశ మెరిసింది..
"అమ్మొస్తోంది" అంది.
వో చేత్తో రెండో తలుపు తోసుకొని లోపలికొచ్చి తులశమ్మ తలుపులు మూసేసి అలాగే గోడకు చేరబడి పోయింది. తన మొఖం తుడుచుకుంది. పరిమళ మెల్లగా లేచి, బిందెలో నీళ్ళు గ్లాసులో ముంచి తులశమ్మ కిచ్చింది.
గ్లాసులో నీళ్ళు తాగుతూ మధ్యలో ఆపి తలెత్తి పరిమళ కేసి చూసి 'ట్యాంకర్ వచ్చిందా..?' అని అడిగారామె.
పరిమళ తలూపింది. నాలుగు రోజుల తర్వాత నీళ్ళ ట్యాంకర్ ఆ వుదయాన్నే వచ్చింది. వొక యింటివాళ్ళు వచ్చి పట్టుకొని లోపలికి వెళ్ళాక మరొక యింటివాళ్లు వచ్చి పట్టుకెళ్ళాలి అని ట్యాంకర్ సిబ్బంది కేక పెట్టడంతో వొలోమంటూ బయటికి రాబోయిన ఆ వీధిలో జనం.. ఆగి వొకళ్ళ తర్వాత వొకరు వచ్చి నీళ్ళు పట్టుకున్నారు. పాపని తాను పట్టుకుంటే చిన్నక్కే వోపిక లేకపోయినా నీళ్ళన్ని మోసి తొట్టెలు, బిందెలు, గిన్నెలు నింపింది.
పాప మళ్ళీ కెవ్వుమనడంతో తేరుకున్న కృష్ణవేణి తులశమ్మ వైపు చూసింది.
తులశమ్మ తన పక్కనే పెట్టుకుని వున్న నల్లగా వున్న గుడ్డ సంచిని పరిమళ వేపు చాచింది... చెయ్యి చాపి అందుకున్న పరిమళ సంచిలోకి చూసింది.

సంచిలో కాగితంలో చుట్టున్న రెండు ప్యాకెట్లు.. వొక అర లీటరు పాల ప్యాకెట్టు వున్నాయి. తల్లి వేపు ప్రశ్నార్థకంగా చూసింది.
'ఉమర్ యింటికి వెళ్ళానా ఉమర్ లేడు. కరోనా అంటా. ఆసుపత్రిలో వున్నాడు. నలుగురు పిల్లలూ, అత్తగారు యింత మందికి వొండి అన్ని పనులూ చేసుకోలేక సతమతమవుతుంది రంజాన్. ఆళ్ల యిల్లు కూడా పిల్లలతో గోల గోలగా వుంది.. పైగా యింకా మొగుడు ఆసుపత్రిలో వున్నాడు, దగ్గర లేననే దుఖం రంజాన్ కి. యెలాగోలా ఉమర్ ని చూద్దామని పెద్దాస్పత్రికి వెళ్ళొద్దామనన్నానో లేదో రంజాన్ వున్నపళాన నాతో వచ్చింది. మమ్మల్ని లోపలికి వెళ్ళనీయలేదు.. అక్కడ యెవరో వ్యానులో వచ్చి ఆసుపత్రిలో వున్నవాళ్ళకి భోజనం, పాలు యిస్తున్నారు. అందరినీ లైన్‌లో దూరం దూరంగా నిలబెట్టి యిచ్చారు.. దాంతో యింత ఆలస్యమయింది..' అని చెప్పింది తులశమ్మ.
'అయ్యో.. కరోనానా?! యెప్పుడొచ్చేస్తాడు భయ్యా?! అంది కృష్ణవేణి.
'చిన్నక్క ఆశగానీ.. కరోనాతో ఆసుపత్రిలో చేరినతను అప్పుడే వచ్చేస్తాడా... అసలు తిరిగొస్తాడా... ?' అనుకొంటూ అక్క వైపు చూసింది. అక్క కళ్ళ నిండుగా నీటిచెమ్మ.
"ప్చ్.. యెన్ని కష్టాలు చూసినా కన్నీటి చెమ్మని మాత్రం మా నుంచి తీసుకొని పోలేదు కాలం.. అదే మిగిలున్న భాగ్యం" అనుకొంది పరిమళ.

పాప యేడుస్తుండడంతో నిలుచున్న పరిమళ సంచిలోని పాల ప్యాకెట్టుని తీసుకొని, సంచిని కృష్ణవేణికిచ్చింది.
ప్యాకెట్టుని కత్తిరించి గిన్నెలో పోసి స్టౌ అంటించింది.
మంట చిన్నగా రెపరెపలాడింది.
'యిది కూడా అయిపోయిందా' అనుకుంటూ గ్యాస్ బండ వైపు చూసింది. యెర్రగా కనిపించిందది. మెల్లగా మంట పెద్దదయింది. పాలు పొయ్యి మీద పెట్టింది.
కృష్ణవేణి సంచిలోంచి భోజనం పొట్లాని తీసి బయట పెట్టి 'రెండే యిచ్చారా..?' అడిగింది.
'వొక్కొక్కటే యిచ్చారు… బతిమిలాడితే మరొకటి యిచ్చారు..' తులశమ్మ చెప్పింది.

పాలు మరగడంతో.. స్టవ్ కట్ చేసి పాలను గ్లాసులో పోసి, కొంచెం పటిక బెల్లం పొడి వేసి తిరగ్గొట్టడం మొదలుపెట్టింది.. పాప యేడుస్తూనే వుందింకా…కృష్ణవేణి చేతుల్లోంచి పాపను తీసుకొని 'జోజో..' అంటూ లాలించడం మొదలుపెట్టింది తులశమ్మ.
కృష్ణవేణి చేతుల్లో వున్న పాల సీసాను కడిగి గోరువెచ్చగా వున్న పాలని పోసిచ్చింది పరిమళ.
ఆ సీసాను తీసుకుని కొంచెం పాలని అరచేతి వెనుక వేసుకొని వేడి చూసి తులశమ్మ పీకని పాప నోటికందించింది. మూడు రోజులయిందేమో పాల రుచి తగిలి.. పాప యేడుపు మాని ఆత్రంగా తాగడం మొదలుపెట్టింది..
'కంచాలు పట్రా..' కృష్ణవేణి పరిమళకి చెప్పింది.
'కంచాలు యెందుకు..? అదో పని తోమటం. ఆ పొట్లాల్లోనే తినేయండి..' చెప్పింది తులశమ్మ.
'ముగ్గురం అదే తిందాం.. పట్రా..' అంది తులశమ్మ.
వో కంచం.. ముగ్గురికి నీళ్లు పెట్టింది. పొట్లాలిచ్చింది కృష్ణవేణి. సాంబారు అన్నం. వో కూర. అరటి పండు వున్నాయి. పరిమళ వచ్చి కూర్చుంది.
పాప పాలు తాగి మత్తుగా వుండిపోవడంతో అలాగే జాగ్రత్తగా వొళ్లో పడుకోబెట్టుకొని వో పొట్లాన్ని తన వైపు లాక్కుంది తులశమ్మ. యిద్దరు ఆ సాంబారు అన్నంతో పిడికెడు.. పిడికెడు తీసి పరిమళ ముందున్న కంచంలో పెట్టారు. తులశమ్మ అరటి పండు తీసి పరిమళకివ్వబోయింది. వద్దన్నట్టు తల వూపి… కంచంలోని సాంబరన్నంలో చేయి పెట్టింది. చిన్న గోరు వెచ్చగా.. మెత్తగా తగిలింది. మెల్లగా తీసుకొని నోట్లో బెట్టుకుంది.. మూడు రోజుల తర్వాత నోట్లోకి వెళ్ళబోతున్న పదార్థం… అంగిలికి తగలగానే పరిమళకి పొలమారింది…
'భద్రం… నీళ్ళు తాగు' తులశమ్మ చెప్పింది.
నీళ్ళు తాగి.. ఆత్రంగా మరో ముద్దని నోట్లో పెట్టుకుంది..
అన్నం వాసన.. అగరొత్తుల వాసన లేదు.

యెన్నాళ్ళ తర్వాత అగొరొత్తుల వాసనలేని అన్నం తినడం.. పరిమళ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

*

తులశమ్మది తెనాలి దగ్గర ఐతవరంలోని వో పేద బ్రాహ్మణ కుటుంబం. వరుసగా తాము ఐదుగురు ఆడపిల్లలు.. వొక మగపిల్లాడు. తండ్రి ప్రతీ రోజూ తెనాలి వెళ్ళి హోటల్ వాళ్ళకీ, కోమట్లకీ తిథి, వార, నక్షత్రాలు చెప్పి, వాళ్ళు యిచ్చిన దక్షిణతో బియ్యం, కూరలు తెచ్చేవారు. తల్లి ఆడపిల్లలు యింట్లో అప్పడాలు వొత్తి పెళ్ళిళ్ళు, పేరంటాలకు అమ్మేవాళ్ళు. యెలాగైతే ఆడపిల్లలందరికీ కష్టపడి గంతకుతగ్గ బొంత సంబంధాలు చేసేశారు. తెనాలి హోటళ్ళో సర్వర్‌గా పని చేసే తమిళ్ళ బ్రహ్మణ కుర్రాడు శేఖరానికిచ్చి తులశమ్మ పెళ్ళి చేశారు. కొన్నాళ్ళు యిద్దరూ తెనాలిలో కాపురం పెట్టారు. వొక ఆడపిల్ల పుట్టాక... హోటల్ మూసేయడంతో పనికోసం శేఖరం గుంటూరు, బెజవాడలు తిరిగి దొరక్కపోవడంతో భార్య పిల్లని తీసుకొని... చెన్నైగా మారని మద్రాసుకి మకాం మార్చాడు.

మైలాపూర్‌లోని అయ్యర్ల వీధిలో వో చిన్న గదిని అద్దెకు తీసుకొని కాపురం మొదలుపెట్టారు. శేఖరానికి హోటళ్ళో పని దొరికింది.. తులశమ్మకి మళ్ళీ కాన్పులో ఆడపిల్లే పుట్టింది.. పిల్లలు పొత్తిళ్ళ నుంచి దిగాక శేఖరం సంపాదన పోషణకు సరిపోయేది కాదు. పక్కింట్లోని కుటుంబం యావత్తూ ఆగరొత్తులు చేస్తూ వుండేవారు. దిండిగల్లు నుంచి  నఫీజ్ వచ్చి అగరొత్తుల పిండిముద్ద.. సన్నని వెదురు పుల్లలు యిచ్చి వెళ్ళేవాడు. పెద్ద పెద్ద చెక్కపీటల్ని ముందు పెట్టుకొని కొంచెం కొంచెం పిండి వుండలుగా తీసుకొని ఆ పిండిని వెదురు పుల్లలకి అంటేలా పీట మీద రుద్దేవాళ్ళు. యింటిలోని వారందరూ చాకచక్కంగా అరొత్తుల్ని వత్తేవాళ్ళు. వాటిని అలా వండాలో ఆరబెట్టి వందేసి అగరొత్తుల్ని కట్లగా కట్టేవాళ్ళు. నాలుగు రోజుల కొకసారి వచ్చే నఫీజ్ కట్టకు ఐదు రూపాయల చొప్పున యిచ్చి.. మళ్ళీ పిండి, పుల్లలు యిచ్చెళ్ళేవాడు. యీ వుపాధి యేదో బాగుందనుకున్న తులశమ్మ పిల్లలిద్దరూ పడుకున్నాక భోజనం చేసి పక్కింటి అయ్యర్ యింటికెళ్ళి అగరొత్తుల్ని వత్తడం నేర్చుకుంది. మొదట్లో పుల్లల్ని వరుసగా పెట్టి వాటి కొసల్ని యెడమ చేతివేళ్ళతో పట్టుకొని పీటమీద పెట్టి పిండితో వాటి మీద అర చేత్తో రుద్దుత్తూ పిల్లల్ని గుండ్రంగా తిప్పడం తులశమ్మకి చేతనయ్యేది కాదు. అలా తిప్పడం చాలా చాకచక్యంగా చేయాలి. పట్టువదలకుండా నేర్చుకుంది. మొదట్లో అయ్యర్ కుటుంబంతోనే కలిసి పని చేసినా... వండ్రంగం వాళ్ళ దగ్గర వో ఐదు రూపాయలు పడ్డం చెక్క పీట చేయించుకు తెచ్చుకొని నఫీజ్ నుంచి నేరుగా పిండి, పుల్లలు తీసుకొని వత్తడం ప్రారంభించింది.

తొలిరోజు అయ్యర్ల యింటిలో పిండిని వత్తి వచ్చి చేతులు కడుక్కొన్నా చేతుల నుండీ అగరొత్తుల వాసన పోలేదు. ఆ రోజు పిల్లలిద్దరికీ చేత్తో అన్నం తినిపిస్తే వాళ్ళు తినకుండా వూసేశారు. దాంతో అన్నం వాసన చూసింది.. అగరొత్తుల వాసన. అప్పట్నించీ అగరొత్తుల వాసన ఆ యింటి సమస్తంలో నిండిపోయింది.

తులశమ్మ మరోసారి గర్భవతయ్యాక శేఖరానికి టి.బీ. సోకింది. యెన్ని మందులు తీసుకున్నా నయం కాలేదు.యింటిలోనే పడుకొని వుండేవాడు. అంత నిండు గర్భంతో కూడా తులశమ్మ అగరొత్తులొత్తితేనే పొట్ట గడిచేది. నఫీజ్ చాలా మంచోడు. యెప్పుడైనా అడ్వాన్స్ కావాలన్నా పది, యిరవై యిస్తుండేవాడు. తులశమ్మ మళ్ళీ ఆడపిల్లని ప్రసవించింది. పాప పుట్టిన మూడు నెలలకే శేఖరం చనిపోయాడు. వెల్లూరు శానిటోరియానికి పంపిద్దామని తులశమ్మ చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. మద్రాసు కాపురం మార్చిన తొలి రోజుల్లో తల్లిదండ్రులకు వుత్తరాల ద్వారా క్షేమ సమాచారాలు తెలుపుతూ వుండేది. వాళ్ళు వొకరి తర్వాత వొకరు చనిపోవడం, అక్కలు నలుగురూ నాలుగు దిక్కులా చెదిరిపోవడం, తమ్ముడు తెనాలిలో వో హోటళ్ళో పని చేస్తున్నాడని మాత్రమే తులశమ్మకు తెలిసింది.

తమ్ముడు అత్తింటి వాళ్ళూ, ఆడు పుట్టింటి వాళ్ళూ లేకుండా ముగ్గురాడ పిల్లల్తో వంటరిగా మిగిలిపోయిన తులశమ్మ మొదట్లో వొంటరి పక్షిలా విలవిలలాడినా. అయ్యర్ల కుటుంబాలు, నఫీజ్ భయ్యా అండదండాలతో బతుకు బండిని ముందుకు సాగించింది.

పెద్ద పిల్ల పావని ఐదో యేట నుంచే తల్లికి పనుల్లో సాయపడేది. పిల్లల్ని పట్టుకోవడం.. ట్యాంకరు దగ్గర చిన్న బిందెతో నీళ్ళు తేవడం.. అగరొత్తులు వత్తడం కూడా త్వరగానే నేర్చుకుంది. ఆ చిన్ని వేళ్ళు చాకాచక్యంగా తన కన్నా వేగంగా అగరొత్తుల పుల్లల్ని గుండ్రంగా తిప్పడం చూసి ఆమె ఆశ్చర్యపోయేది.. దిగులు పడేది. తమిళ పుస్తకాల్ని ఆత్రంగా చదివే శేఖరం తన కూతుళ్ళని బాగా చదివించి కలెక్టర్లని చేయాలని పుస్తకాల కలలు కంటుండేవాడు. పావనిని మునిసిపల్ బళ్ళో చేర్చింది కానీ పావని వెళ్ళడానికి ఆసక్తి చూపలేదు. రెండో పిల్ల కృష్ణవేణి. మూడో పిల్ల పరిమళల్ని మాత్రం బళ్లో వేసి చదివించింది.
నఫీజ్ మొదట్లో బస్సులో వచ్చి, నడిచి సంచి పట్టుకొని తిరుగుతూ అగరొత్తుల వ్యాపారం చేసేవాడు. తర్వాత సైకిల్ మీద ఆ తర్వాత చిన్న మోపెడ్ మీద వస్తుండేవాడు. అతనికి పెద్ద సంసారం అవడంతో అంతకన్నా ముందుకెళ్ళలేకపోయాడు. డబ్బులు మాత్రం యెప్పుడూ నమ్మకంగా చెల్లి చేస్తూ వుండేవాడు.

'బ్రహ్మాళ్ళ కష్టం తింటే బాగుపడం' అంటుంటే "నువ్వు అలా అంటావు కానీ యెవ్వరి కష్టాన్ని వుంచుకోవు... పైగా యెదుటి వాళ్ళ కష్టం చూడలేక నువ్వొక రొట్టె ముక్క తగ్గించుకొని యెదుటివాళ్ళకి పెట్టేవాడివే భయ్యా" అనేవారు తులసమ్మ.

వంద పుల్లల కట్టకి ఐదు రూపాయలతో మొదలైన సంపాదన యిప్పుడు కట్టకి యాభై రూపాయలు యిచ్చేదాకా వచ్చింది. నఫీజ్ వృద్ధుడై పోవడంతో అతని రెండో కొడుకు ఉమర్  తండ్రి వ్యాపారం చేపట్టాడు. ఆ పిల్లోడు కూడా తండ్రిలాగే నీతి నియమాలు కలవాడు. తండ్రి మోపెడ్ బదులు యిన్‌స్టాల్‌మెంట్ల మీద కొనుక్కున్న బైక్ వేసుకొచ్చి పుల్లలు యిచ్చి, తీసుకెళ్తుండేవాడు జాగ్రత్తగా లెక్క రాసుకొని పదిహేను రోజులకొకసారి డబ్బులు యిచ్చేస్తూ వుండేవాడు. కృష్ణ వేణి, పరిమళలని అక్కా.. అక్కా.. అంటూ ప్రేమగా వుండేవాడు.
ఉమర్ కి  రంజాన్ తో పెళ్ళయ్యా అతనికి సంసార భాద్యతలు మరింత పెరిగాయి. యీలోగా పెద్ద పిల్ల పావనికి పెళ్ళీడు వచ్చింది. కృష్ణవేణి, పరిమళలు చదువుకుంటూ వుండేవాళ్ళు. కృష్ణవేణి స్కూల్ నుండి వచ్చి తల్లికి అగరొత్తులు వత్తడంలో సాయం చేసింది.

పరిమళ మాత్రం అగరొత్తుల్ని అంటుకునేది కాదు. పైగా బళ్ళో అందరూ 'అగరొత్తుల పెట్టె' అని యేడిపిస్తురని తల్లి దగ్గర వాపోయేది. పావనికీ పెద్దగా కలలుండేవి కావు. తల్లి తప్ప మరో ప్రపంచం తెలియని తల్లి చాటు బిడ్డ. ఆ వీధి దాటి పావని బయటకు వెళ్ళిన సందర్భాలు అరుదు. రోజు సాయంత్రం పూట మార్కెట్ కెళ్ళి కూరా నారా తులశమ్మ తెచ్చేది. పావని అగరొత్తులు చేసుకుంటూ, చెల్లెళ్ళని చూసుకుంటూ యింటిలోనే వొండిపోయేది.
కృష్ణవేణి, పరిమళలకు మాత్రం పెద్ద పెద్ద కలలుండేవి. పరిమళ మాత్రం బాగా చదువుకొని ముందు యీ వాసనలోంచి బయటపడి పోవాలని కోరుకునేది. గోరింటాకు పెట్టుకున్నా పరిమళకు తప్ప ఆ యింట్లో మరెవరి అరచేతులూ యెప్పుడూ పండేవి కాదు. అగరొత్తుల పిండితో నల్లగా అయిపోయి ఆ చేతుల్లో గోరింటాకు పండేది కాదు. ఆ తర్వాత యెవ్వరూ గోరింటాకు పెట్టుకునే వాళ్ళు కాదు.

పక్కింటి అయ్యర్ పావనికి వో సంబంధం చూశాడు. బ్రహ్మాళ్ళ పిల్లాడే తల్లిదండ్రి లేరు. మెరినా బీచ్‌లో పుస్తకాలు, క్యాలెండర్లు, పెన్నులు అమ్ముతూ పొట్ట పోసుకుంటున్న జాగ్రత్తున్న పిల్లాడు. మొదట్లో తులశమ్మ కుటుంబం లేదని సందేహించినా వెనకున్న మరో యిద్దరి పిల్లల్ని చూసి ఆ పెళ్ళికి వొప్పుకుంది.

పెళ్ళికీ పెద్దగా ఖర్చు పెట్టలేదు. అల్లుడికి వో వొంగరం. కొత్త బట్ట మాత్రం పెట్టగలిగింది తులశమ్మ. అది అప్పుగా యిచ్చిన డబ్బుల్తో. యెంత పని చేసినా రోజుకి నాలుగు కడుపులు నిండటం, కట్టుకోవడానికీ బట్టలకు తప్ప మరో పైసా మిగిలేది కాదు.
'దండెం మీద బట్ట, వంటి మీద బట్ట తప్ప యింకేం లేకపోతే యెట్టమ్మా' అని పరిమళ యెన్నిసార్లు వాపోయినా అంతకుమించి కొనే పరిస్థితి లేదు.

పిల్లలు మాత్రం ఆరోగ్యంగా పుష్టిగా, కళకళలాడుతూ వుండేవాళ్ళు. పెళ్ళయ్యాక పావని, ఆయ్యర్ల పిల్లోడు తాంబరంలో చిన్న గది తీసుకొని కాపురం పెట్టారు. కొన్నాళ్ళు రోజూ పావని వచ్చి తల్లికి సహాయం చేసేది. కానీ అయ్యర్ల పిల్లోడి రోజూ బీచ్‌కి తనతో రమ్మని చెప్పడంతో తనతో వెళ్ళి తనకి సాయం చేసేది. వారానికొకసారి తల్లి దగ్గరకు వచ్చి చెల్లెళ్ళతో గడిపి మధ్యాహ్నానికి వెళ్ళిపోతుండేది. తల్లి వొక్క సంపాదన చాలకపోవడంతో కృష్ణవేణి తల్లి యెంత వద్దంటున్నా పదో తరగతి మధ్యలో చదువు మానేసి తల్లితో కలిసి అగరొత్తులు వత్తడం మొదలుపెట్టింది.

పరిమళ పన్నెండో తరగతి చదువుతున్నప్పుడు పెళ్ళయిన మూడేళ్ళకు పావని గర్భవతయింది. తులశమ్మ మురిసిపోయింది. యేదొక పిండి వంట వండుకొని వారం వారం కూతురి దగ్గరికెళ్ళి తినిపించి వస్తుండేది. పరిమళ పన్నెండో తరగతి పాస్ అయ్యాక యెంసెంట్ రాసి యింజనీరింగ్ సీట్ వస్తే చేరే ప్రయత్నంలో వున్నప్పుడు తల్లిని స్మార్ట్ ఫోన్ యిన్‌స్టాల్‌మెంట్లో కొనివ్వమని అడిగింది. పదో తరగతి పాసయినప్పుడు పావని కొనిచ్చిన సెకండ్ హ్యాండ్ ఫోన్ యిస్తారాని పరిమళ గొడవ పెట్టింది. అక్క కాన్పు కోసం కూడబెట్టిన మూడు వేలు తప్ప తన దగ్గర మరేమీ లేవన్నది తులశమ్మ. అంతగా అయితే అగరొత్తులు చేసి సంపాదించుకొని ఫోన్ కొనుక్కోమంది.

రెండు రోజులు అలిగినా మూడో రోజు బలవంతంగా పీట ముందేసుకొని అగరొత్తుల పిండిలో చేయి పెట్టింది పరిమళ. ఆ రోజు భోజనం చేస్తూ బోరున యేడ్చేసింది ఆ అగరొత్తుల వాసనకి. ఆ పరిమళం ప్రతీదాని అస్థిత్వాన్ని కభళించేస్తుంది.. బట్టల్లోకి, గోడల్లోకి,అరచేతుల్లోకి, అన్నంలోకి, అపరిచితం లోకి మిన్నగులా పాకిపోతుంది.. దాని నుంచి దేనికీ మినహాయింపు అంటూ వుండదు.

స్కూల్ వున్నప్పుడు మధ్యాహ్నం పూట స్కూల్లోనే భోజనం చేసేది పరిమళ. వొక్క పూట మాత్రం తన చేతుల్తో యెసరు కడిగి పెట్టి తినేది. యిక అగరొత్తుల వాసన రాని చేతులు ఆ యింట్లో మిగల్లేదు.

తొమ్మిదో నెల రాగానే పావని పుట్టింటికొచ్చింది. ఆ పది రోజులూ నలుగురూ పండుగలాగా గడిపారు. పావనిని అగరొత్తుల్లో చెయ్యి పెట్టనివ్వలేదు పరిమళ. పరిమళ యిన్‌స్టాల్‌మెంట్లు కొనుక్కున్న ఫోన్‌లో ఫోటోలు తీసుకున్నారు. రెండేళ్ళ క్రితం తెనాలి నుంచి వచ్చిన తెలిసిన వాళ్ళు తులశమ్మకి ఆమె తమ్ముడి వివరాలు చెప్పి, ఫోన్ నెంబరిచ్చారు. తెనాలిలో వున్న మామయ్యకి ఫోన్ చేసి తమ నెంబర్ చెప్పారు. తమ ఫోటోల్ని వాళ్ళకి పంపారు.

పరిమళ కొనుక్కున్న ఫోన్ని తన అవసరాలు కోసం వాడుకోవటం వద్దనుకొన్న తులశమ్మ పావని కొనిచ్చిన ఫోన్ నుంచి తులశమ్మ తమ్ముడికి ఫోన్ చేసింది.
తమ్ముడు పెళ్ళి చేసుకొని తెనాలి రైల్వే స్టేషన్ ముందు టిఫిన్ సెంటర్ పెట్టుకున్నాడని. యిద్దరు మగపిల్లలు తనకని తెలిసి సంతోషించింది. తమ్ముడు అక్క, పిల్లల్ని రమ్మని పిలిచాడు. తమకి యేర్పడ్డ ఆ కొత్త బంధంతో తల్లీ, కూతుళ్ళు అప్పుడప్పుడూ మాట్లాడుతూ వుండేవాళ్ళు. తమకీ బంధువులు వున్నారనుకోవడం సంతోషాన్నిచ్చింది వాళ్ళకి. తన నలుగురి అక్కల జాడా మాత్రం తమ్ముడికి తెలియదని చెప్పాడు.

వొక రోజు పావనికి నొప్పులు రావడంతో కృష్ణవేణి యింట్లోనే వుండిపోతే పావనిని తీసుకొని తులశమ్మ, పరిమళ  పెద్దాసుపత్రిలో చేర్పించారు. నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నించాక కుదరకపోవడంతో సిజేరియన్ చేశారు. పావనీకి లోకల్ యెనస్తీషియా యిస్తున్నప్పుడు పొరపాటు జరగటంతో పూర్తి యెనస్తీషియా యివ్వాల్సి వచ్చింది.
ఆడపిల్ల పుట్టింది. కానీ పావనీ యెనస్తీషియా నుంచి కోలుకోలేక కోమాలోకి వెళ్ళిపోయింది. పది రోజులు వెంటిలేటర్ మీద వుంచారు. తులశమ్మ దగ్గర వున్న డబ్బులు,  ఉమర్ దగ్గర అప్పు తీసుకొచ్చిన ఐదు వేల రూపాయలు, పావనీ భర్త దాచుకున్న పది వేల రూపాయలూ అయిపోయాయి. యిక లాభం లేదని వెంటిలేటర్ తీసేశారు.

భార్య అంత్యక్రియలు జరిపి అయ్యర్ల పిల్లోడు అటు నుంచి అటే వెళ్ళిపోయాడు.

పసిబిడ్డతో, యిద్దరు కూతుళ్ళతో తులశమ్మ అలా మిగిలిపోయింది. ఆ బిడ్డను పోషించడం, ఉమర్ అప్పు తీర్చడం కోసం ముగ్గురూ పగలూ రాత్రులు కష్టపడేవారు.

పాప పుట్టిన నక్షత్రం ప్రకారం పి, అ అక్షరాలతో పేరు పెట్టమని అయ్యర్ సూచించినప్పుడు తులశమ్మ ‘పూజ’ అని, కృష్ణవేణి ‘అర్చన’ అని వొక్కసారే అన్నారు.
‘అబ్బా అగరొత్తుల వాసన గుర్తొచ్చే పూజ, అర్చనలేమిటీ యేదైనా మంచి పేరు పెడదాం’ అని ‘సుహాసిని” అని పేరు పెట్టింది పరిమళ.

పరిమళకి యెంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చింది. యింజనీరింగ్ కాలేజీలో ఫ్రీ సీట్ వచ్చింది. కానీ ఆ మాత్రం ఖర్చు కూడా పెట్టుకొనే పరిస్థితి లేదని, వచ్చే యేడాది చేరుదువు కానీ అని చెప్పడంతో కళ్ళ

నీళ్ళతో ఆగిపోయింది పరిమళ. అగరొత్తులు చేస్తూనే విలువైన విద్యా సంస్థల్లో జాయిన్ అవ్వడానికి కావాల్సిన అనేక యెంట్రన్స్‌లకు ఫీజు కట్టి ప్రిపేరవడం మొదలుపెట్టింది పరిమళ.

యింతలో కోవిడ్ వచ్చింది. అంతా లాక్‌డౌన్ అయిపోయింది. బిత్తరపోయిన వాళ్ళు యేమి చేయాలో తెలియక అందరితో పాటు కంచాలు మోగించారు. చమురు దీపాలు పెట్టారు.

సరుకు తీసుకెళ్ళే ఉమర్ రాలేదు. బాగా కేసులు రావడంతో చెన్నైలో సంపూర్ణ లాక్‌డౌన్ నెల రోజుల పాటు పెట్టేశారు. యెవరికీ కాలు బయట పెట్టే పరిస్థితి లేదు. ఆ నెల రోజులూ వీధిలోని దేవాలయం వాళ్ళు వంట సామాను యింటింటికీ పంచారు. వాటితో కాలం గడిపారు. అమ్మా క్యాంటీన్ ల్లు లేకపోతే యేమయి పోయేవాళ్ళమో అనుకున్న వాళ్ళు యెందరో. పాపకే పాలకి యిబ్బంది అయ్యేది. వొక్క అరలీటర్ ప్యాకేట్ మాత్రం కొన్ని రోజుల పాటు పాల డిపో అతను అరువు యిచ్చాడు. వొక పూట పాలు పట్టి, వొక పూట పటిక బెల్లం నీళ్ళు కలిపి పట్టేవారు. పాపకు పాలు చాలక యెప్పుడూ యేడుస్తుండేది.

కొన్ని వారాల తర్వాత వుదయం నుంచి 10 గంటల వరకూ కర్ఫ్యూ సడలించారు. ఉమర్ వచ్చి అగరొత్తులు తీసుకొని డబ్బులిచ్చి, 'వ్యాపారం లేదు అగరొత్తులు యెవరూ కొనడం లేదు. గుళ్ళు మూసేశారు. యెవరూ యిళ్ళల్లో పూజలు కూడా చేసుకోవడం లేదు. కరోనా తగ్గాక పిండి తెచ్చిస్తాను' అన్నాడు.
తల్లీ కూతుళ్ళు హతాశులయిపోయారు. ఉమర్ ఔదార్యంతో యిచ్చిన ఆ కొద్దిపాటి డబ్బుతో పాపకు పాల డబ్బాలు కొని, వొక పూట తిని, తినక మరో రెండు నెలల పాటు కాలం గడుపుతూ వచ్చారు. యెక్కడ చూసినా కేసులు. మృత్యువు విలయతాండవం చేస్తుంది. వీధిలో చాలా మంది యిళ్ళకు తాళాలు వేసుకొని తమ బంధువుల యిళ్ళకు వెళ్ళిపోయారు.

పరిమళ 'మనం కూడా మామయ్య దగ్గరకెళ్ళిపోదాం' అని ఫోన్ చేసింది.
వ్యాపారం లేక యేమి చేయాలో తోచక తామున్నామని మరో రెండు నెలలు పోయాక వద్దురు గాని అని మామయ్య చెప్పడంతో చేసేదేం లేక అలా వుండిపోయారు. మొన్నటితో యింట్లో అన్నీ అయిపోయాయి. 'ఉమర్ కోసం కర్ఫ్యూ సడలించిన సమయంలో ఉమర్ యింటికి వెళ్ళిన తులశమ్మ ఉమర్ కి కరోనా అని తెల్సి అతన్ని చూడాలని ఆసుపత్రికి వెళ్ళినప్పుడు ఆ రోజు ఆసుపత్రి నుంచి తెచ్చిన భోజనాన్ని అమృతం లాగా తిన్నారు.

***

సెల్‌ఫోన్ రింగయింది. అక్క కృష్ణవేణి ఫోటో డిస్‌ప్లేలో వచ్చింది. పది రోజులుగా తులశమ్మతో పాటు కృష్ణవేణి ఆసుపత్రి దగ్గరకు వెళ్ళి రోజు భోజనం తీసుకొస్తుంది. ఆ రోజు కూడా వెళ్ళింది.
ఫోన్ యెత్తి 'అక్కా.. చెప్పు అమ్మని డాక్టర్ చూసారా' అడిగింది పరిమళ.
అవతల్నుంచీ యేడుపు గొంతుతో కృష్ణవేణి.
'పరిమళా... మన అనుమానం నిజమేనే అమ్మకి చేసిన కరోనా టెస్ట్ పాజిటివ్ వచ్చిందని ఆసుపత్రి కరోనా వార్డులో చేర్చేశారే.. నన్ను కూడా ఐసోలేషన్ పెట్టేశారే... పధ్నాలుగు రోజుల తర్వాత వదుల్తారట... నువ్వు, పాప జాగ్రత్త.. మామయ్యకు చెప్పు..' అంటూ యేడుస్తూ ఫోన్ పెట్టేసింది.

చేతిలో ఫోన్ పట్టుకొని, పాపని చంకనేసుకొని గుమ్మంలో కూలబడిపోయి ఫోన్ వేపే చూస్తుండిపోయింది. ఆ ఫోన్‌లో యిన్‌కమింగ్ తప్ప అవుట్ గోయింగ్ లేదు.
రెండు రోజులుగా తులశమ్మ దగ్గుతూనే వుంది. అల్లం కషాయం పెట్టుకొని తాగింది.. అప్రయత్నంగా తయారైన అగరొత్తులు పరిచిన చున్నీని తీసుకొని మొహానికి మాస్కులా కట్టుకుంది. వాసన తెలియటం లేదంది... బతుకంతా పరిమళం మీదే లాక్కుచ్చిన తులశమ్మకి వాసనే పోవటం వ్యక్తిగతం కాదు.. సామూహికం.. సందోహం నుంచి వొంటర్లుని చేసి.. అంతరానివాళ్ళుగా వెలివేసే విషం.

పదిరోజుల్లో కృష్ణవేణీకి పాజిటివ్ అని తెలిసి పరిమళ నిస్సత్తువగా దేముని పటం ముందు నిలబడింది. ఆ క్షణం ఆమెకి తన చదువు.. వుద్యోగం లాంటి కోరికలు కలలు ఆశలూ యేమి మనసులో మెదల్లేదు. వొకే వొక్క కోరిక... "నన్నూ, యీ పాపాయిని తల్లిలేని పిల్లల్ని చెయ్యకు సామీ.. ప్రతిరోజూ మూడు అగరొత్తులు వెలిగిస్తాను" అని కోరుకుంది.. వేడుకొంది. ప్రార్థించింది.
కానీ ఆమె కోరిక పరిమళంలేని అగరొత్తుల పొగలా గాలిలో కల్సిపోయింది.
బతుకంతా వెలిగించుకొన్న అగరొత్తుల పరిమళం లేకుండానే తులశమ్మ, కృష్ణవేణీ అంతిమ యాత్ర వొంటరిగానే విసిరేయపడింది.

'యీ పాపని యెలా పెంచాలి? యేమి చేయాలి?' నేనెక్కడికెళ్ళాలి? రేపు యెలా? రేపు కాదు యివ్వాళ యెలా..?' నిస్సత్తువుగా తలని గుమ్మానికి ఆన్చింది పరిమళ.

'యేయ్ పరిమళం.. ట్యాంకరొచ్చిందే.. కనపడ్డంలా..' నాలుగిళ్ళవతలి తెలుగావిడ కేకేసింది.
'పరిమళం... అవును బతుకంతా పరిమళమే.. వొక్క జీవితంలో మాత్రం యెలాంటి పరిమళం లేదు!' అనుకొంటూ బిందె తీసుకొంది.

***

పరిమళ బాగా ఆలోచించి చంటిబిడ్డని తీసుకొని ఉమర్ యింటికి వెళ్ళింది. ఉమర్ భార్య రంజాన్ పరిమళ ని చూసి దుఖంతో పెనవేసుకోబోయి మాస్క్ సైరన్ వేసినట్టు ఆగిపోయి ముట్టుకోకుండానే కన్నీరుమున్నీరయింది. యీ వొక్క పిల్లని పెంచటం యెలాని తను బెదురుతుంది. రంజాన్ కి ముగ్గురు పిల్లలు.  వృద్ధురాలైన అత్తగారు. యెలా యీ సంసారాన్ని నిలబెడుతుంది.?! ఆలోచనలు పరిమళలో.

“దీదీ.. భయ్యా బండి మీద నేనెళ్ళి పిండి వేసొస్తాను. భయ్యా యెవరెవ్వరికి వేసోచ్చేవారో తెలుసా?! వొకప్పటంత బిజినెస్ రావడానికి టైం పడుతుంది కానీ రాకుండా పోదు.. థర్డ్ వేవ్ అంటున్నారు.. అదో భయముంది. కానీ యెన్నాళ్ళని యింట్లో వుంటాం?! యింకా యెన్నాళ్ళని అక్కడ నుంచో యిక్కడ నుంచో అన్నం తెచ్చుకుంటాం. యెన్నాళ్ళ ని భయపడతాం” అంది పరిమళ.
రంజాన్ కి తెలిసిన వాళ్ళ దగ్గరకి వెళ్ళారిద్దరు. కొద్ది మంది యిప్పుడు వద్దన్నారు. కొద్దిమందిలేరు. కొందరు అసలు అమ్ముడవుతాయానే అనుమానాన్ని వెలిబుచ్చారు.
అగరొత్తుల పరిమళం పుట్టుక సంబరాల నుంచి.. పండుగలలో, దేవస్థానాల్లో, ఆఖరికి అంతిమయాత్ర వరకు తోడు వస్తుంది.. అటువంటి పరిమళానికి గిరాకీ లేకుండా పోయింది.
పరిమళ కోవెల వీధిలోకి వెళ్ళి అక్కడున్న అంగళ్ళ వాళ్ళని కనుక్కుంది.
వాళ్ళు పరిస్థితి యింతకు ముందులా లేదన్నారు.
“యీ వొక్క అగరబత్తీలతోనే డబ్బులు సరిపోదు. దోమల బెడద యెక్కువగా వుంది. ఆ దోమల కడ్డీలకి గిరాకీ వుందంట. అవి కూడా చెయ్యండి” కోవెల వీధి లో కొబ్బరికాయల తంగవేలు చెప్పాడు.

వాటిని కూడా చేద్దామని యిద్దరూ నిర్ణయించుకున్నారు. ఆ పిండి తెచ్చుకోడానికి  కావాల్సిన డబ్బుల కోసం పరిమళ వొక నిర్ణయానికి వచ్చి.. చిన్నప్పటి నుంచి దాచి పెట్టుకున్న పుస్తకాలన్నింటిని పాత పేపర్ల దుకాణంలో అమ్మేసింది.. కోల్పోయింది పుస్తకాల్ని కాదు.. తన కలల్ని సమూలంగా కోల్పోయింది..
మరికొన్ని డబ్బులు రంజాన్ అప్పు తెచ్చింది. యిద్దరూ మెల్లగా నిలదొక్కుకోడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు.
కోవెల వీధిలో అగరబత్తీలు యివ్వడానికి వచ్చిన పరిమళని తన అంగటిలో కాసేపు కూర్చోమని అడిగి.. చిన్నపిల్లకి పాలు పట్టించి.. మిగిలిన పిల్లలకి అన్నం పెట్టి వచ్చి దేవమ్మ  పరిమళ దగ్గర తీసుకొన్న అగరొత్తులకి డబ్బులిచ్చింది. పరిమళ బయలుదేరి కోవెలవీధి మొదటినున్న గులాబీపూల లక్ష్మి అంగడి దగ్గర రావాల్సిన డబ్బుల కోసమాగింది. పరిమళ భుజం మీద నిద్రపోతున్న సుహాసినీని చూస్తూ “పెద్దక్క బిడ్డ కదా” అని లక్ష్మిఅడిగింది.
పరిమళ తన భుజం మీద వున్న సుహాసిని వైపు చూస్తూ… “వూ.. అనబోయి ఆగి నా బిడ్డ” అంది.

'చదువుకోవాలి నువ్వు..  అమ్మ కలలు.. అమ్మమ్మ కలలు.. పెద్దమ్మ కలలు.. నా కలలు నింపుకొని నువ్వు.. బాగా..   చదువుకోవాలి..'  అనుకొంది పరిమళ..

పరిమళ కలల పరిమళం ఆవిరైపోయిన చోటే మొదలైన కొత్త కల పరిమళపు కలల ప్రవాహం..

***

కుప్పిలి పద్మ.